# ఆశాంకురం

పురాణకాలం:

మునివర్యుడికేమీ పాలుపోవడం లేదు. అయనో మహాయజ్ఞం తలపెట్టాడు. అది జనశ్రేయస్సు కాంక్షించి చేస్తున్నాడు. దాంతో పాటు అది పూర్తయ్యాక నూరు మంది విద్యార్థులకు వసతి ఉన్న గురుకులం నడపాలని ఆయనకుంది. మంచి పనులు చేయటానికి పాపిష్టి డబ్బు అవసరం. అది ఆయన దగ్గర లేదు. ఆ కారణంగా ఆయనకి ఏం చెయ్యాలో తోచడం లేదు.

చింతిస్తున్న మునివర్యుడికి కాస్త ఉత్సాహం కలిగించాలని ఆయన స్నేహితుడు వచ్చి మాటల సందర్భంలో "పక్క రాజ్యానికి రాజుగా ఉన్న దాతని యాచించరాదా! ఆయన అడిగినవారికి లేదనకుండా ఏదో ఇచ్చి పంపుతాడు" అని సలహా ఇచ్చాడు.

అందుచేత ఓ మంచి రోజు చూసుకొని మునివర్యుడు దాత దగ్గరకు ప్రయాణమై వెళ్ళి తన గోడు వెళ్ళబోసుకున్నాడు. దాంతో మునివర్యుడి చిత్తము కించిత్ శాంతి నొందగా చింత దాతను పట్టుకొంది.

అడిగినవాడు ప్రసిద్ధుడు. తల పెట్టినది లోకకల్యాణం. కాని తన ధనాగారంలో ధనం లేదు. అంతే కాకుండా తనకి వల్లమాలినంత కీర్తి ఉంది. దాన్ని వదులుకోలేనంత ప్రలోభం ఉంది. కీర్తిని ధనంగా మార్చుకోలేడు. ధనాన్ని కీర్తిగా మార్చుకోవచ్చును. కనక తన దగ్గరున్న దాన్ని దేన్నైనా ధనంగా మార్చటానికి అవకాశం ఉందేమో ఆలోచించాలి. దానికి వ్యవధి కావాలి.

"మీరు శ్రమపడి ఇంత దూరం వచ్చారు. రెండ్రోజుల పాటు మా నగరంలో విశ్రాంతి తీసుకోండి. ఈ లోపల మీ కోర్కెతీరే ఏర్పాటు చేస్తాను" అని మునివర్యుడిని అర్థించి అయన్ను రాజపురోహితుడింటికి పంపాడు.

మాటైతే ఇచ్చాడు కాని ఆ ఏర్పాటు ఏమిటో తోచక తల పట్టుకొన్న దాత దగ్గరికి అతని కుమార్తె కన్య వచ్చి "జనకా! ఏల నీకీ చింత?" అని అడిగింది.

దాత వంచిన తల ఎత్తి ఆమెను చూసాడు. రాజు కప్పుడు తన కూతురు కన్య కనిపించింది. ఎల్లా కనిపించిందంటే మిసి మిసి యవ్వన సంపదలతో ధగధగా మెరిసిపోతూ

కనిపించింది. పచ్చని పసిమి వర్ణంతో మెరిసిపోతున్న కుందనపు బొమ్మలా కనిపించింది. నడిచి వచ్చిన లక్ష్మిలా కనిపించింది.

ఆమెను చూస్తూ దాత చిరునవ్వు నవ్వాడు. అతని చింత పటాపంచలైంది. దాత సంతోషానికి, అది తనని చూడగానే కలిగినందుకు ఆ ముగ్ధ పొంగి పోయింది.

రెండ్రోజులు పూర్తి కాగానే రాజు మునివర్యుడికి కబురు పంపాడు. ఆయన వచ్చాక ఆయనని సుఖాసీనుడిని చేసి, "నా కూతురు కన్య చాలా అందమైనది. ఆమె పొందుకు చాలా మంది రాజులు ఉవ్విళ్ళూరుతున్నారు" అని చెప్పి కాస్సేపాగాడు మాటలు వెతుక్కుంటూ.

"అయితే?" మునివర్యుడు అర్థం కాక అడిగాడు.

రాజు నింపాదిగా మాటలు కూర్చుకొని చెప్పాడు.

"ఆ కన్యను మీకు దానం ఇస్తాను. మీతో పట్టుకుపోండి. ఆపైన ఆమెను కోరిన రాజుల వద్దకు వరుసగా వెళ్ళి ఒక్కొక్కరి దగ్గర ఆమెను ఓ ఏడాది పాటు కుదవ పెట్టండి. వదిలి పెట్టండి. ప్రతి వారి దగ్గర వారి వారి తాహతుల ననుసరించి ద్రవ్యం రాబట్టండి. ఆ ధనంతో మీరు తల పెట్టిన లోక కళ్యాణం సాధించండి."

మునివర్యుడు సంతోషించి, కన్యను స్వీకరించి, దాతని దీవించి వెడలిపోయాడు కన్యతో సహా లోకకళ్యాణ నిమిత్తమై.

* * *

**రాజులకాలం**

రాజుకేమీ పాలు పోవటం లేదు. పరాయి రాజు దేశం మీదకి దండెత్తి వచ్చాడు. క్రితం వారం మొత్తం దేశం అంతా ఉత్సవాల ఉత్సాహంతో కోలాహలంగా ఉంది. ఆ ఉత్సవాల కోసం తమ పల్లెలకు పోయిన సైనికులు చాలా మంది ఇంకా తిరిగి రాలేదు. ఆఖరికి తన వేగుల వాండ్లు కూడా ఆదమరిచి ఉన్నారు. కాని పరాయిరాజు యొక్క వేగులు అప్రమత్తులై ఉండి తమ రాజుకి అతివేగంగా ఉప్పు అందించారు. పరాయి రాజు క్షణం ఆలస్యం చేయకుండా గుర్రాల మీద కదిలి సేనతో రయాన వచ్చాడు.

ఈ పరిస్థితుల్లో రాజు మంత్రిని పిలిచి, "ఇప్పుడు రాజ్య క్షేమానికి మార్గం ఏమిటి?" అని అడిగాడు.

మంత్రి బుర్ర పాదరసంలా పని చేసింది. పరాయి రాజు బలాన్ని బలంతో ఎదిరించి గెలవాలంటే తమ బలం ఎదుటి బలం కంటే అధికంగా ఉండాలి. ఇప్పుడు అధికంగా లేదు. కనుక ఆ మార్గం లాభం లేదు. ఇప్పుడు కేవలం ఉపాయంతో అపాయం తప్పించుకోవాలి. ముందర పరాయి రాజు బలహీనతని కనిపెట్టాలి. దాని నాధారంగా

చేసుకొని ఉపాయం పన్నాలి. ఇదంతా చేయటానికి తనకి రెండ్రోజులు వ్యవధి కావాలి. నగరు ద్వారాలు మూసే ఉన్నాయి. ఉన్న కొద్ది సైనికుల్ని సేనాధిపతి కోట బురుజుల మీదే ఉంచాడు. ముట్టడైతే జరిగింది కాని పోరు మొదలవలేదు. మొదలైతే ఓ రెండు రోజుల పాటు శత్రువులని నిలవరించటం కష్టం కాదు. ఇదంతా ఆలోచించి రాజుకి వివరించి రెండ్రోజుల వ్యవధి కోరాడు.

పరాయి రాజు, కోటను ముట్టడించాక, కుందేలుని వంటింట్లో పెట్టి తలుపులు మూసిన వంటవాడిలా ధైర్యంగా ఉన్నాడు. పల్లెల నుంచి నగరుకి తిరిగి రావటం మొదలు పెట్టిన సైనికులు ఒక్కొక్కరే రావటం వల్ల కోట చుట్టూ మోహరించి ఉన్న శత్రు సైన్యాలని చూసి తాము సంఘటితము కాకపోవటం వల్ల బెదిరి పారిపోసాగారు. పరాయి రాజు రోజంతా పారిపోతున్న సైనికుల వేటలో గడిపి రాత్రి ఆటకత్తెల ఆటల్లో మునిగి పోయాడు.

అయితే కోటలో మంత్రి వేగుల వాళ్ళని పిలిచి, "తెల్లవారే లోపల పరాయి రాజు బలహీనత గురించి ఆరా తీసి చెప్పకపోతే మీ పేగులు లాగించి మీ మెళ్లో వేయిస్తాను" అని హెచ్చరించి పంపాడు.

ఆ కారణంగా చీకటి చాటున మారు మార్గాల బయటకు వచ్చిన వేగుల వాళ్ళకి, పరాయి రాజు గుడారం నుంచి రాత్రంతా వినవచ్చిన గజ్జల గల గల నుంచి, జావళీ పాటల నుంచి, అతని బలహీనత పెద్ద శ్రమ లేకుండానే తెల్సిపోయింది. ఆ విషయం తెల్లవారేసరికి మంత్రికి నివేదించారు.

మంత్రికి చేయవలసిన పని బోధపడింది. సమర్థులైన మాట కత్తెలను, మాట కారులను చీకటి చాటున బయటకు పంపి రాకుమార్తె చాలా అందమైనదని, ఎంతోమంది రాజులు ఆమెను పెళ్ళాడాలని ఉవ్విళ్ళూరుతున్నారని, ఆ రాచకన్యను వివాహం చేసుకోగలిగిన వాడిదే నిజమైన అదృష్టమని పరాయి రాజుకి భోగట్టా అందేలా చేసాడు. పరాయి రాజు, మంత్రి చూపించిన ఎరకి, చేపలా గాలానికి చిక్కాడు. వెంటనే కోటలో రాజుకి కోట బయట రాజు కబురు పెట్టాడు.

"మీ రాకుమార్తెను మా రాజు కిచ్చి వివాహం చేసి బంధుత్వం నెరిపి బాగుపడ్తారో, పోరు జరిపి సర్వనాశనం అవుతారో మీ ఇష్టం. మీరు సంధికి సమ్మతిస్తే మీ కన్యను, తన సైన్యాన్ని తీసుకొని తిరిగి వెళ్ళిపోతాడు. మావగారితో పోరుకింకెప్పుడూ రాకపోవటమే కాక ఇతర్లు దండెత్తి వస్తే వారు మీకు సాయం వస్తారు" అంటూ.

మంత్రి పన్నాగం నెరవేరింది.

"బలహీనుడి పట్టమహిషి అవటం కంటే బలవంతుడి చిన్నరాణి అవటమే మేలు" అని మంత్రి రాజుని ఒప్పించాడు.

విషయం విన్న రాకుమార్తె ఖిన్నురాలై "జనకా! నేను వేరొకరిని ప్రేమించాను. ఈ పెళ్ళికి నేను సిద్ధంగా లేదు" అని చెప్పింది.

"అమ్మాయీ! నువ్వు ఆ వేరొకరిని ప్రేమించిన దాని కంటే దేశాన్ని ఎక్కువగా ప్రేమించటం రాచకన్యల ధర్మం. దేశ క్షేమం కోసం నువ్వు పరాయి రాజుని పరిణయం ఆడాలి" అని రాజు బోధించాడు.

"పోనీ యుద్ధం లేకుండా మీ రాయనకి లొంగిపోతే ప్రాణహాని జరగదు కదా" అని ఆమె అమాయకంగా అడిగింది.

"మాన హాని జరుగుతుంది. దేశం పరతంత్రమైపోతుంది. నీ అన్న మహా అయితే సామంతరాజు అవుతాడు. ఇంత జరిగినా నీకు నువ్వు ప్రేమించిన వేరొకరిని వివాహం చేసుకొనే అవకాశం లేదు. పరాయి రాజు నిన్ను బలిమిని పట్టుకు పోతాడు. మేమతనితో ఆ తరువాత యుద్ధం చేసి గెలిచి నిన్ను విడిపించుకు వచ్చినా, నువ్వు అగ్ని పరీక్షలో నెగ్గినా, ఆ వేరొకడు ఏ మాత్రం పౌరుషం ఉన్నవాడైనా, పరాయి ఇంట కొంత కాలం ఉన్న నిన్ను స్వీకరించడు" అని తండ్రి ఆమెకు వివరించాడు.

ఆ విధంగా దేశ కళ్యాణం నిమిత్తమై రాచకన్య కల్యాణం స్థిరపడింది.

* * *

**పరాధీన కాలం**

బాల తండ్రి కేమీ పాలు పోవటం లేదు. బాల పెళ్ళి కెదిగి పోయి రేపో మాపో రజస్వల అవటానికి సిద్ధంగా ఉంది. కొడుకేమో కోడలు చచ్చిపోయినప్పటి నుంచి ఇల్లు పట్టకుండా వారకాంతల వాడల్లో తిరుగుతున్నాడు. ఆ సమయంలో తన పెద్ద కూతురు పోయిన కబురు బాల తండ్రికి తెలిసింది. పెద్ద కూతురు అత్తవారి ఊరు వచ్చాడు. ఆమె ఏడోసారి గర్భం ధరించి మృత శిశువును కని చనిపోయింది. పదమూడో ఏట కాపురానికి వచ్చిన ఆమె జీవితం ముప్ఫై ఏళ్ళకే ముగిసిపోయింది. మొదటి రెండు సార్లు గర్భస్రావాలు అయ్యాయి. తరువాత ఇద్దరు పుట్టి కొద్ది కాలం పెరిగి పోయారు. తరవాత ఇద్దరు బట్ట కడ్తున్నారు. ఏడోసారి రక్తం నల్లగా పోతుంటే ముట్టు కుట్టనుకొన్నారే కాని కడుపులో పిండం కుళ్ళి పోతోందని ఊహించలేకపోయారు. దాంతో ఆమే పోయింది.

తనకి ఇల్లాలు పోయింది. కోడలు పోయింది. ఇప్పుడు కూతురు పోయింది. తన ఇల్లు పట్టిన విధవ చెల్లెలు ఇంట్లో అందరికి గంజి వార్చి వడ్డిస్తోంది. కొడుకు ఇంట్లో కానీ ఇవ్వటం మానేశాడు. అందుకని తను కూతుర్ని మాట వరుసకి కూడా పుట్టింట్లో పురుడు పోసుకోమనలేదు. ఆమె అత్తవారు పంపుతామనలేదు. ఆమె కూడా వస్తాననలేదు.

తల్లి చావు పిల్లల్ని పక్కలో పెట్టుకొని వాళ్ళ ముందు సంగతి గురించి ఆలోచిస్తూ

పడుకొన్న బాల తండ్రికి ఏమీ పాలుపోలేదు.

కష్టాలు వచ్చినప్పుడు బంధుమిత్రులే కదా ఆదుకొనేది! ఇల్లంతా అటువంటి వారితో నిండి ఉంది. చచ్చినామె భర్త మనస్సు బండబారగ యాంత్రికంగా కర్మకాండ నిర్వహిస్తున్నాడు. అది ఆమె పోయి అయిదో రోజు. ఇల్లు, కోడలు పోయిన ఇల్లు ఎల్లా వుంటుందో అల్లా విచారంగానూ, అస్యవ్యస్తంగానూ ఉంది. అటువంటి సమయంలో ఆ కుటుంబ శ్రేయోభిలాషి, బాల తండ్రికి "అంతగా దిగులు పడకపోతే మీ బాలను మీ అల్లుడికిచ్చి ముడెట్టెయ్యరాదూ! అల్లా చేస్తే మీ అల్లుడు మీ కొడుకులాగా బోగం కొంపలు పట్టుకువేళ్ళాడాల్సి రాదు. మీ కూతురు పెళ్ళిలాగా అన్న బెంగ మీకు తీరుపోతుంది. మీరు ఆలోచిస్తూ కూర్చుంటే ఊళ్ళో వాళ్ళెవరో అవకాశం తన్నుకుపోతారు. మీ మనవలకి సవతి తల్లి వస్తుంది. మీ బాలకి ఆ తల్లి చావు పిల్లల మీదున్న ప్రేమ, ఆ పరాయి పిల్ల కెందుకుంటుంది చెప్పండి" అంటూ అడగకపోయినా సలహా ఇచ్చాడు.

అతనే మళ్ళీ "పెళ్ళాం పోయిన పదమూడో రోజు పెళ్ళిజరిగేటట్లయితే ముహూర్తాలు చూడవలసిన పనుండదు. కావలసిన బంధువులం ఎల్లాగూ వచ్చాం. మళ్ళీ మళ్ళీ రావాలంటే మాకూ కష్టం. మీకూ ఖర్చులో ఖర్చు కలిసి వస్తుంది" అంటూ మార్గం కూడా చూపెట్టాడు.

బాల తండ్రి ఆలోచించాడు. తన అల్లుడి సంపాదన బోగం వాళ్ళ పాలు కారాదు. తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తే తన కూతురు తింటుంది. తన మనవలు తింటారు. అతనికి బాలని అల్లుడికిచ్చి పదమూడో రోజు పెళ్ళి చేయమన్న సలహా నచ్చింది.

బాల తండ్రిని ఒప్పించిన బంధువే విధరుడి తల్లి క్కూడా బోధించాడు,– "కొత్తగా వచ్చిన పిల్ల మీ అబ్బాయిని కొంగుకు ముడి వేసుకొంటుందని అనుమానం పెట్టుకోకండి. ఈ ఇంటికి పెద్దదిక్కు మీరు. మీరీ ఇంట్లో పులిలా తిరుగుతుంటే ఆ పిల్ల చేతికి అధికారం ఎలా వెళ్తుంది! పన్నెండేళ్ళ పిల్ల చచ్చినట్టు పడుండక ఎదురొస్తుందా? మొగుడ్ని కొంగుకు ముడేసుకోవాలంటే ఎన్ని టక్కులు నేర్వాలి! సంసార స్త్రీ కి అవి పట్టు పడటం ఎంత కష్టం! పట్టుపడేసరికి కాన్పుల్లో నీరసించి జంజాటంలో పడి తీరుతుంది. అయినా ఇరవై సంవత్సరాల మాట ఇప్పుడెందుకు? నంనోరాజా భవిష్యతి" అంటూ.

విధరుడి తల్లి ఆలోచించింది. కొడుక్కినిండా నలభై ఏళ్ళు లేవు. అతనికి వెంటనే పెళ్ళి చేయకపోతే జరిగే నష్టం కొట్టవచ్చినట్టు అర్థమవుతూనే ఉంది. కొడుకు నెలకి 150 కరుకులీ కరువు రోజుల్లో సంపాదిస్తున్నాడు. ఈ కుటుంబం అంతా ఆ సంపాదనే తింటున్నారు. సంపాదించే వాడు సుఖంగా ఉండాలి. ఆ సుఖం ఇంట్లోనే అమరకపోతే

వీధిలో వెతుక్కుంటాడు. వెలయాలికి తీసుకోగలిగినదే వెల. కనక డబ్బు పిండేస్తుంది. అల్లా జరుగుతే కుటుంబం వీధిలో పడ్తుంది. కనక సంపాదనా పరుడైనా కొడుక్కి పెళ్ళి చేయటం అవసరం. బాల ఉండగా మరో పిల్లని చూడటం అనవసరం. పిల్ల ఏపుగా ఎదిగి ఉంది. రేపో మాపో ఈడేర్తుంది. ఇల్లా ఆలోచించి ఆమె పెళ్ళికి ఒప్పుకొని కొడుకుని బలవంతపెట్టి ఈ వైరాగ్యం ఎన్నాళ్ళో ఉండదని నచ్చచెప్పి, ఒప్పించింది.

బాల పెళ్ళి ఆ విధంగా నిశ్చయమైంది. బాల గోల పెట్టింది. కాని కుటుంబ కళ్యాణం కోసం అక్కస్థానం స్వీకరించక తప్పలేదు.

## నేటికాలం:-

జానకికి ఏమీ పాలు పోవటం లేదు. వారం రోజుల క్రితం భర్త చెకప్ కని తనని ఓ కొత్త డాక్టరు దగ్గరకి తీసుకు వెళ్ళాడు. ఆ డాక్టరు తన పొట్టమీద ఏదో పూసి దాని మీద స్టెత్‌స్కోపు లాటిది పెట్టి టి.వి. తెరమీద భర్తకి చూపిస్తూ ఏదో చెప్పాడు. భర్త స్కానింగ్‌కి తీసుకువెళ్ళినట్టు అర్థమైనా డాక్టరు ఏం చెప్పాడో వినపడలేదు.

"నమ్మకమేనా?" అని భర్త డాక్టరుని అడుగుతుంటే వినిపించింది. డాక్టరు నమ్మకమేనన్నట్టు తలూపడం గమనించింది తను.

కాని తన భర్త తనతో ఏమి చెప్పలేదు. తనకి నమ్మకంగా తెలిసిన విషయం తను తల్లికాబోతున్న విషయం. అది అక్కడికి వెళ్ళక ముందే తెలిసింది. ఇంక తెలియాల్సింది కడుపులో పెరుగుతున్నది తమ వంశోద్ధారకుడో తన లాగే మరొకరి వంశం ఉద్ధరించడానికి ఉద్దేశింపబడినదో.

భర్త చెప్పక పోయినా అత్తగారు చెప్పింది. తన కడుపులో శిశువు 'ఆడ' అని.

ఆవిడకి అతను చెప్పాడని అర్థం చేసుకొంది.

"నీ మొగుడుది పెద్ద సంపాదనేం కాదు" అంటూ ఆ తరవాత అత్తగారు సంభాషణ కొనసాగించినపుడు జానకికి నవ్వువచ్చింది.

ఏడాది క్రితం తన పెళ్ళి చూపులనాడు అత్తగారు, ఇదే వ్యక్తి సంపాదన గురించి మరోలా మాట్లాడింది.

"నా కొడుకు పెద్ద ఉద్యోగస్తుడు. నెలకి మూడు వేలు తెచ్చుకుంటున్నాడు. ఎంతోమంది యాభై వేలిస్తామని ముందుకు వచ్చినా వాడికి ఏ అమ్మాయి నచ్చక పోయింది. మీ అమ్మాయి నచ్చింది. అందుకనే ముప్ఫై వేలకి తగ్గుతున్నాం."

జానకి తండ్రికి వేరే గత్యంతరం లేక పోయింది పి.యఫ్.లో పర్మనెంట్ విత్‌డ్రాయల్ చేసి పెళ్ళి చేసాడు.

పెరిగే ధరల్లో ఆడపిల్లని పెంచి విద్యాబుద్ధులు చెప్పించి బోలెడు డబ్బు పోసి మొగుడ్ని కొనటం కష్టం. కనక ఎబార్షన్ చేయిస్తానన్నాడు భర్త.

ధరలు పెరుగుతుంటే జీతాలు పెరుగుతున్నాయి కావా! ఉద్యోగంలో ప్రమోషన్లు రావు! పైగా అమ్మాయి పెళ్ళీడుకి వచ్చేసరికి ఎయిత్ పే కమీషన్ సిఫార్సులు అమలు జరిగినా జరగవచ్చు.

జానకి వాదనని భర్త పెడచెవిని పెట్టాడు. అతను గర్భ స్రావం చేయించి తీరాలనుకొంటున్నట్టు తెలియజేసాడు. జానకి తన చివరి అస్త్రం ప్రయోగించింది.

"అందరూ మీలాగానే ఆలోచిస్తే, రేపెప్పుడైనా మీకో కొడుకు పుడ్తే వాడికి పెళ్ళాం ఎల్లా దొరుకుతుంది?" అది ఆమె కున్న బ్రహ్మాస్త్రం లాంటి ఆర్గ్యుమెంటు.

"బాగా పులిసున్న వాళ్ళు ఆడపిల్లల్ని కంటూనే ఉంటారు. మూర్ఖులూ కంటూనే ఉంటారు. మనకి కో అంటే కోటి కోడళ్ళు " అని జానకి భర్త బ్రహ్మాస్త్రాన్ని గడ్డి పరకగా తీసి పారేశాడు.

అప్పట్నుంచి జానకికి ఏమీ పాలు పోవటం లేదు. ఆడపిల్ల పుడ్తే 'ఆశ' అని పేరు పెట్టుకొందామని అనుకొంది. జానకికి తను చిన్నప్పట్నుంచి ఆడపిల్లగా పడ్డ కష్టాలు, అవమానాలు గుర్తుకు వచ్చాయి. తనకీ పన్నెండేళ్ళ వయస్సు వచ్చినప్పట్నుంచి అమ్మా నాన్నలు, అన్నదమ్ములు పెట్టిన ఆంక్షలు గుర్తుకు వచ్చాయి. వీధిలో కుర్రకారు కూసిన కూతలు గుర్తుకు వచ్చాయి. నడి వయసు వారు చూసిన చూపులు గుర్తుకు వచ్చాయి. పెళ్ళీడు వచ్చాక పెళ్ళి చూపుల తతంగం పేరిట జరిగిన మగపిల్లడిని కన్న వారి దర్పాల ప్రదర్శనలు, తన కన్నవారి అణకువల ప్రదర్శనలు గుర్తుకు వచ్చాయి. వారి గొంతెమ్మ కోర్కెలు వీరి అశక్తతలు గుర్తుకు వచ్చాయి. ఈ ప్రపంచలోకి మరో ఆడప్రాణిని తెచ్చి ఆ ప్రాణిని దుఃఖ పెట్టడానికి తనెవరనిపించింది. గర్భస్రావానికి ఒప్పుకొందామనిపించింది. అదంతా ఓ క్షణం మాత్రమే!

జానకి ఒప్పుకుంటే వ్యక్తి కళ్యాణం జరిగిపోను. కాని జానకి ఒప్పుకోకపోడానికే నిర్ణయించుకొంది.

తన కూతురు తనకి రవ్వంత ఆశ. తన కూతురికి తను కొండంత అండ. రాబోయే తరం రావటం కోసం మనుష్యుల మనుగడ కోసం ఆశని పెంచుకోవాలి.